# బతుకుపోరు

మేనేజరు గారి అమ్మాయి పెళ్లి శుభలేఖ వచ్చినప్పటి నుండీ తోటి ఉద్యోగులంతా కలిసి ఒక మంచి బహుమతి ఇవ్వాలనుకున్నారు. దానికి చందా ఆర్రూపాయలు. గతఏడాది రామనాథన్, తమతోటి ఉద్యోగిని పెళ్లి చేసుకున్నాడు. అప్పుడూ అంతాకలిసి చందావేసి రెండు వెండి పళ్లేలు బహుమతి ఇచ్చారు. అట్లాంటి బహుమతే ఇవ్వాలి. బంగారం ఉంగరం ఇద్దాం అంటున్నాడు ఒక తోటి ఉద్యోగి. మంచి ఆలోచనే.

సిటీ జిమ్నాజియమ్ హాల్ నిర్మాణానికి చందా రెండురూపాయలు. ఇంటి కొక్కపువ్వు. ఈశ్వరునికి మాల.... అంటూ వచ్చారొక బృందం. ఈ కాలనీ కుర్రాళ్లే. ఇంకా మీసాలు నల్లబడకుండానే నాయకుల వేషాలు వేస్తున్నారు. సాయంత్రం ఏ బీరు బాటిల్కో, కౌబాయ్ సినిమాకో ఈ చందా సమర్పితం. ఈ యువ క్రీడాకారుల జిమ్నాజియమ్ క్రీడ. చందా తీసుకున్నారు. తప్పదు. అందరూ ఇస్తున్నారు.

నాగార్జున సాగర్ విహారయాత్ర. కృష్ణానది మీద పడవలో పోయి మధ్యలో ఉన్న గుట్టలో బౌద్ధస్థూపాలను చూసి రావటానికి ప్రత్యేకంగా బస్సు. మీరు తప్పక రావాలి. అంజనేయులు గారి పేరు రాసుకో. పదిరూపాయలే. భోజనం టీ దాంట్లోనే. కొందరు సతీసమేతంగా వస్తున్నారు. మీరు మీ ఆవిడను తీసుకురండి. ఇది అరుదైన అవకాశం. ప్రకృతి సౌందర్యంలో.... కవిత్వం మాట్లాడుతున్నాడు చిరంజీవి. అయ్యా చిరంజీవీ, స్నేహితునికి ప్రాణం మీదికి వచ్చిందని అప్పు అడిగితే నూటికి పదిరూపాయలు మిత్తీ చెల్లించందే తమరు అప్పు పెట్టరు కదా. ఇంత గొప్ప స్కీము ఆలోచించారంటే ఏదో కథ ఆరంభించినట్టే. అయినా నాగార్జునసాగర్ చూడాలి. భార్యను తీసుకుపోవాలి. ఏభైరూపాయలు.

ప్యూన్ నర్సిములు చచ్చిపోయాడు. ఖర్చులకు తలా మీ ఇష్టమొచ్చినంత ఇచ్చుకోండి. పావం పిల్లల్తో నర్సిములు పెళ్లాం - యూనియన్ జాయింట్సెక్రటరీ ఇరవైరూపాయిలిచ్చాడు. అంజనేయులూ - నర్సిములు కుటుంబానికి ఒక నెల తిండన్నా మనం పెట్టాలి. నర్సిములుకోసం తన జీతమంతా ఇచ్చేయాలనిపిస్తుంది. అంతమంచివాడు. కాని ఈనెల వడ్డీల ఒత్తిడి. అప్పు తీర్చే ఒత్తిడి. పదిరూపాయలే ఇచ్చాడు.

మన వీధిలో గూండాలు తయారయ్యారు. సైకిల్‌తో డాష్ ఇచ్చి అమ్మాయిల్ని అల్లరిచేసి.... ఈవ్ టీజింగ్.... సోషల్ ఈవిల్‌గా తయారయ్యారు. వాళ్లకు బుద్ధి చెప్పాలి. ముందు ఓ గూర్ఖాని పెట్టుకోవాలి అంటున్నారు. గూర్ఖాకి జీతం నెలకి వంద. అవసరమే. దానికి తోడు వాళ్లను పోలీసులకు అప్పజెప్పాలి. హిప్పీజుత్తు కుర్రాళ్లు - మంచి పనే... నెలనెలా చందా అయిదురూపాయలు వసూలుచేస్తున్నారు. పెద్దవాళ్లు చెయ్యాల్సిన పని కుర్రాళ్లే చేస్తున్నారు. వాళ్లను ప్రోత్సహించాలి.

జాక్‌పాట్ సిండికేట్. గుర్రపందేలు. ఆ జాకీగాడు కావాలని గెలుస్తున్న గుర్రాన్ని వెనక్కిలాగాడు. గవర్నమెంట్ ఎందుకు వీటిని బాన్ చెయ్యదు. నోనో. ఇవ్వలేను. ఇవ్వను. క్షమించండి.

డ్రామాటిక్కెట్ అయిదురూపాయలు. టైపిస్టు సుహాసిని. తీయని గొంతుతో, చిరునవ్వుతో, రంగస్థలం ప్రశంసలతో తన్నుకు పోతుంది.

యూనియన్ చందా గతనెలదీ ఈనెలదీ మొత్తం నాలుగు రూపాయలు. జూనియర్ ఇంజనీర్ బదిలీ సందర్భంలో ఇచ్చిన పార్టీ ఖర్చు రెండురూపాయలు. యూనియన్ అప్పుల్లో ఉంది. హైకోర్టు కేసు సందర్భంగా ఖర్చులు. స్ట్రయిక్ పీరియడ్లో చేసిన ఖర్చు.

ఆఫీసర్ గృహప్రవేశానికి గిఫ్ట్.... ఎవరికి వారే ఇచ్చుకోండి.

ఇంటద్దె నలభై అయిదు.

నెలఖర్చు ఇంటికింద. భార్యాభర్తలు + ఇద్దరు పిల్లలు. డెబ్బయి రూపాయలు.

డాక్టరు ఖర్చులు. డాక్టరు మంచివాడు.

పాత అప్పు తీర్చటానికి వంద.

చిట్‌ఫండ్. మరదలు పెళ్లి సమయంలో ఎత్తుకున్నది. నెలనెల అరవై. బంధువులు రాకపోతే.

బస్సు టిక్కెట్ నెలకి పన్నెండు రూపాయలు.

మధ్యాహ్నం లంచ్ టైమెలో చాయ్ సమోసా. నెలకు పదిహేనురూపాయలు.

దాదాపు నాలుగు వందలు. మరి ఆదాయం రెండు వందల ఇరవైరూపాయలు. లోటు. దాదాపు నూట డెబ్బయి నాలుగు.

ఇది 1971 అక్టోబర్‌లో ఆంజనేయులు అనే ఆఫీసు క్లర్క్ జమాఖర్చుల జాబితా.

పండ్లు, స్వీట్స్, తాజ్ మహల్, కామత్, మైసూర్ కేఫ్‌లలోకి అడుగు పెట్టలేము.

స్నేహితులు దగ్గర అప్పులు చెయ్యాలి. చేబదుళ్లు తీసుకోవాలి. వీటికోసం స్నేహితుల చుట్టూ తిరగాలి. స్నేహితులు మంచివాళ్లు. కాని తీసుకున్న అప్పు తీర్చాలి కదా. మర్యాద, పరువు నిలబెట్టుకోవాలికదా.

చదువుకున్న భార్య ఉద్యోగం ప్రయత్నం చెయ్యాలి. తప్పదు.

రామనాథన్ పెళ్లిచేసుకున్న ఏడాదికే ఎలికల మందు తాగి చచ్చిపోయాడు.

చావటం కాదు బతకటం ఒక్కటే దారి. కాని బతుకు ఒక జైల్లా ఉంది. బందీలుగా బతుకు.

ఈ జైలు గోడల్ని బద్దలు కొట్టాలి. ఎవరు బద్దలు కొట్టేది?

లేదా రాఘవుల్లా ఉద్యోగం విడిచిపెట్టేసి, ఈ అప్పులు వాళ్ల రాలేని చోటికి దూరంగా పారిపోవాలి.

సాయంత్రం బాబాగుడికి వెళ్లి మొక్కుకోనాలి. రక్షించమని మొక్కుకుని రావాలి.

భానుమతికి ఉద్యోగం ఇప్పించు తండ్రీ..... అని ప్రార్థించుకోవాలి......

*

*కథ 1971 అక్టోబర్*

*[ఆ ఏడాది విరసం సమావేశం సందర్భంగా వేసిన కథా కర పత్రిక]*